# జైలులో - మైలురాళ్ళు

టక్-టక్-టక్
సుత్తిశబ్దం దూరాన
ఖైదీల గుంపులు కదిలేయి ఊహలో
అంజయ్య ముఖం తీవ్రమయింది.
టక్-టక్-
రాళ్ళు (బద్దలౌతున్నాయి)
ఒకప్పుడు గుండెలు బ్రద్దలయ్యాయి
ఆవేదనల సుత్తి దెబ్బలతో
పోలీసులు బేడీలు తగిలించారు
కారు వేగంగా జైలు వైపు కదిలింది
రాళ్ళు-మైలురాళ్ళు - రోడ్డుమీద వెనక్కి తిరిగాయి
జీవితంలో మార్పులు మైలురాళ్ళు
జైలు కటకటాలు వికటంగా నవ్వాయి?
ఊచలమధ్య అంజయ్య ముఖం కుంచించుకుపోయింది
ఒక మైలురాయి
చెట్ల గుబురులు
చిన్నతనం - అజ్ఞానం
తాతయ్య మనీపర్సు దొంగిలించాడు....
తోటిపిల్లలకు పిప్పరమింట్లు పంచిపెట్టాడు
చెంపలు వాచాయి - ఎరుపెక్కాయి
నిప్పుల్లో తూనీగలు
నీళ్ళల్లో ఈగలు - రాలుస్తే

గిల గిల కొట్టుకున్నాయి
మైలురాయి తిరిగింది
తల్లి చనిపోయింది
తాతయ్య ఎప్పుడో స్వర్గంలో తిడుతున్నాడు
పొంచుక్కూచున్న దాయాదులు ధనం లేదన్నారు.
బ్రతుకులో ఒక క్రొత్త మైలురాయి
పాలిపోయి తెల్లగా నుంచుంది
అనంతమైన ప్రపంచంలో
ఆహారం దొరక్కపోదు
అంజయ్య యిల్లు విడిచి పరారి అయ్యాడు
చదువుల పుస్తకాలు మూసాడు
ప్రపంచం కాగితాలు త్రిప్పాడు
బ్రతుకులో కావలసింది - ఒకటే-
ధైర్యం - సాహసం-
ప్రపంచంలో మోసం కాదు
పాపం కాదు
ఫలితమొక్కటే ప్రధానం
మంచి చెడ్డలు మానవుని మనస్సు రంగులు
ఆకాశంలోకి ఎగరాలి
నిధి దొరికితే ధనికుడు
నిధి ఉన్న మనిషిని మాపితే
మరునాడే ధనికుడు
యుక్తులు తెలియాలి
పట్టులు దొరకాలి

గుట్టులు చిక్కాలి
ఎర్రటోపీల బారి తప్పాలి
మరొక మైలు రాయి తిరిగింది
దూరాన ఎత్తయిన కొండ-
అల్లుకున్న పొదలు చెట్లు-
వల్లమాలిన దారులు -
జేబులు కత్తిరించాడు
కన్నాలు వేశాడు
రైలులో కాలక్షేపంచేసి
స్నేహితుల ట్రంకుపెట్టెలు మార్చాడు.
సన్యాసులకు ప్రాపంచిక జ్ఞానం
ధనికులకు సన్యాసి రూపం
దానం చేసాడు అంజయ్య
దొంగ అన్నారు జనం తనెవరో తెలియకుండా
మర్రిచెట్టు క్రింద బిచ్చగాళ్ళు-
కూలి దొరకని రిక్షావాళ్ళు-
శరీర బాధతో మనస్సు ఉల్లాసం కోసం
మధ్య పానం కోరే కాయకష్టంచేసే ఘనులు
ధర్మాత్ముడని పొగిడారు అంజయ్యని
వదిలి పెట్టబడిన ముదితలు
రాత్రి చీకటి వెలుగుల్లో
పాలిపోయిన మైలు రాళ్ళల్లో
గమ్యస్థానం చివరకోసం ఎదురుచూస్తుంటే
దారి చూపి వదిలాడు
తెలివైన ఎర్రటోపీలు

అంజయ్యను తెలుసుకోవాలని
తికమక పడ్డారు
పట్టు, గుట్టు తప్పి
పడ్డాడు జైలులో - అదొక అలవాటయ్యింది
కటకటాలు తనకు స్నేహితులే
సరదాగా ఖంగుమనే కటకటాలు
ఈనాడు వికటంగా నవ్వాయి
టక్-టక్-టక్-
ఖైదీలు-పోలీసులు-అదుపుల్లో
శబ్దాలు చేస్తున్నారు
వయసుడిగిన అంజయ్య
శారీరకమైన సేద కావాలనుకున్నాడు
ధైర్యం - సాహసం - వదిలి
శాంతియుత జీవితం కావాలనుకున్నాడా
ఒంటరిజీవితం చుట్టూ అన్నీ అభిమానాలే
అవసరానికి ఇదుకోలేని గర్భదరిద్ర అభిమానాలు
పుష్ప జీవితంలో అడుగుపెట్టింది
మట్టిరూపాలు చేసి మనుగడ గడిపిన కుమ్మరయ్య
కూతురు పుష్పను ఒంటరిచేసి గుడిసె వదిలి
కూలిపోయాడు మట్టిమీద
స్నేహం అభిమానంతో ఆదుకున్నాడు పుష్పను అంజయ్య
వయసుతో నిమిత్తం లేదనుకుంటూ
అభిమానాలు మరీ హత్తుకున్నాయి
అంజయ్య లేనిదే బ్రతకలేనంటుంది పుష్ప
వయసుకు తగ్గ వరుణ్ణి తెస్తానంటాడు అంజయ్య

జాలి ప్రేమల మధ్య తగాదా
వాయిదా వేశాడు దేవుడు తీర్పుకు
మరొక మైలురాయి నిటాగ్గా నిలుచుంది
అంజయ్య జీవిత గమ్యస్థానం చూడాలని
ఇద్దరూ కలిసి కదిలారు ఎక్కువగా గుర్తుపట్టలేని నగరంలోకి
ప్రక్కన వెడుతున్న మనిషినే పోల్చుకో
లేని బిజీ మనుష్యులలోకి
తుపాకుల దుకాణం దొర దేవేంద్రప్రసాదు
ప్రసాదించాడు కొలువులు యిద్దరికీ
ఒంటరి జీవితంలో నేర్చుకున్న
వంటపని అవసరమొచ్చింది అంజయ్యకు
ఆడదానిలా ఇల్లు సర్దే యోగ్యత తీసుకుంది పుష్ప
రోజులు గడిచాయి సాఫీగా
కాని, జాలి, ప్రేమల మధ్య తగాదా
వాయిదాపడుతోనే వచ్చింది
అభిమానాన్ని ప్రేమగా మార్చుకునే
హంతకబుద్ధి తనకూ లేదంటాడు అంజయ్య
హృదయంలో అభిమానం ద్రవించి నిండితే
శారీరకమైన వయస్సు స్వాప్నిక
దశ మాత్రమే అంటుంది పుష్ప
దేవేంద్రప్రసాదు ఇంద్రభవనంలో
ఆ ముసలి పడుచు - కాని దంపతులు
కల్లోల మనస్సులతో కాలం గడిపారు
దేవేంద్రప్రసాదు కరుణామూర్తి

అతని యిల్లాలు అర్ధంకాని ఆడది
ఒక రాత్రి-
ప్రసాదు వేటనుంచి వచ్చాడు
గాఢంగా మత్తులో తూలుచు
ప్రసాదు పత్నికి నగర విహారంలో కాలపరిమితి తెలియలేదు
ఎన్నో రాత్రులు ఎక్కడనుంచో ఊడిపడుతున్న భార్యామణి
స్వర్గభోగాలు శంకించాడు ప్రసాదు
వేటలో ఫేలిన తుపాకి యింకా వేడిగానే వుంది
పత్ని రాగానే శతఘ్నిలా పేల్చాడు తుపాకి ప్రసాదు గాలిలోకి
కారులో దిగపెట్టిన మనిషికి కనుసైగ చేసింది పొమ్మని ఆమె
కారు చుర్రుమనగానే తుపాకి ప్రేలింది
గురి తప్పింది - ఆవేశం పారిపోయింది
ఆవేశంతో పట్టలేని ప్రసాదు ఆవిడపై లంఘించాడు
చేసి పనిని మరిచి నిర్లక్ష్యంగా ఛీత్కారం చేసింది
నాగరికత రూపంలో ఆమె
కరుణామూర్తి ప్రసాదు కరిగిపోయాడు
ఆవేదనతో తుపాకి అలాగే వదిలేశాడు
వలచి వలపించుకున్న ముదిత
పరపురుషుని పరిష్వంగంలో వణకడం
పుర్రెలో పురుగు పుట్టినట్లే
నిజాయితీకి ఊసరవెల్లి రంగు
ఉందంటే నమ్మలేకపోయాడు ప్రసాదు
ఆవేదన హెచ్చింది
ఒంటరిగా తల మోదుకున్నాడు
కనిపించిన వస్తువుని కసిగా తన్నేశాడు

అప్రతిష్ఠతో బ్రతికేకంటే హతమైపోవడం మంచిదన్నాడు
మనిషిని చంపడంకంటే
బ్రతకనిచ్చి బాధలు పాలు చేయడం
ఆవేదన చిచ్చుపెట్టి రగిలించడం
నిజమైన నరకం
అప్రతిష్ట లేకుండడానికి
ఆమెను బాధపెట్టడానికి
ఒకటే మార్గం - తన హత్య
నమ్మి మోసపోయిన వలపు
నాశానికి దారితీస్తుంది ఒకప్పుడు
ప్రసాదు ఇది తప్పదనుకున్నాడు
ఆలోచనలలో క్రూరలా పడుకున్నాడు.
కాఫీ తెచ్చిన అంజయ్యకు కథ తెలిసింది
నిలుచుని చల్లారిన కాఫీ చూస్తూ కదిలిపోయాడు
ముసలి అంజయ్యలో నీరసం పోయింది
ఒళ్ళంతా కోపంతో వేడెక్కి వణికిపోయింది
కరుణామూర్తికి కృతఘ్నతారూపం
ధరించి నిలుచుంది ఆమె ఎదురుగా
సహించరాని ప్రవర్తన ఏ మనిషిలోనున్నా
సకాలంలో త్రుంచాలి దాన్ని
ప్రాపంచిక సౌఖ్యం కోసం ధనం ప్రధానం
అనుకున్న అంజయ్య కాదనుకున్నాడు
అన్నీ వున్న దేవేంద్రుడికి
మనశ్శాంతి లేదు
డబ్బుల మెరుగుల కొండల మధ్యం

మానసిక చిత్రవధ భరించలేనిది
నిజాయితీకి నిలవని మనుష్యులు
క్రమశిక్షణ ఎరుగని మనుష్యులు
జీవితంలో పాఠాలు నేర్చుకోవాలి
జీవితమే మార్చుకోవాలి
లేదా జీవితమే మానుకోవాలి
మంచి చెడులు లేని ఈ ప్రపంచం
మాటకుమాత్రం విలువ ఉండాలి!
మాటకి విలువ నివ్వని మనుష్యులు
మనుగడకు అనర్హులు
వంట గదిలో కసాయి కత్తి పదును చేశాడు
కోడిపిట్టల పీకలుకోస్తే గిల గిల తన్నుకున్నాయి
మేకల మొండేలు తప తప కొట్టుకున్నాయి ఆ గదిలో
తనకేమీ కరుణ లేదు; భయం లేదు;
మనిషి మొండెమే కొట్టుకుంటే
అసలు భయపడే అవసరమే లేదు
గుడ్డ కప్పిన ప్లేటుక్రింద పదునుకత్తి మెరుపు దాగింది
కాఫీ తెచ్చానన్నాడు అంజయ్య నమ్రతగా
పుష్ప స్థానంలో అంజయ్య కనిపించడం
ఆశ్చర్యమయింది ప్రసాదు భార్యామణికి
ఒళ్ళు నొప్పులు సర్దుకుంటూ ఒయ్యారంగా
ఒరిగింది శయ్యమీద ఆమె
కాఫీ కప్పు అందుకోవాలని
తళ తళ మెరిసే కత్తితో తాండవం చేశాడు అంజయ్య
ధనం కోసమనుకుంది ఆమె

మెడలోని నగ వలిచి యిచ్చింది
నగ అందుకుంటూ అంజయ్య
తెగ నరికాడు ఆమె మెడను
ఆక్రందించిన ఆమె చిలికిన రక్తం
ఆ గదినంతా ఎరుపు చేసింది
ప్రసాదు పరుగెత్తుకొచ్చాడు
పుష్ప భయంతో వణికిపోయింది
మీరు చేయలేని పని నేను చేసాను
అన్నాడు అంజయ్య మెల్లిగా ప్రసాదుతో
పుష్ప గొల్లుమని ఏడ్చింది అంజయ్యను పట్టుకుని
దేవేంద్రుని భవనంలో పరివారం
ఎర్రటోపీలను పిలిచారు
బేడీలు తగిలించుకున్న అంజయ్య మోడులా నిలుచున్నాడు
మరొక మైలురాయి కదిలింది వేనక్కు
కటకటాల మధ్య నిలుచున్న అంజయ్య సుత్తి దెబ్బలు విన్నాడు
ఏది అవినీతి? ఏది అక్రమం? ఏది అన్యాయం!
అది తెలుసుకొనే కాలం యింకా రాలేదు
బాహ్య ప్రవర్తనల మీద కాకుండా
మనస్తత్వాన్ని అనుసరించి
తీర్పులిచ్చే న్యాయశాస్త్ర అవతరణ ఎప్పుడో
ఉరిశిక్ష విధించారు అంజయ్యకు
అతనికి తెలుసు-తన మొండెం కూడా
రేపు గిలగిలా తన్నుకుని అగాధంలోకి జారిపోతుందని
తన చావుకు భయం లేదు అంజయ్యకు

దేవేంద్రప్రసాదు వలపుకు న్యాయం చేసాడు
పుష్ప వలపుకు న్యాయం చేసాడు
ప్రసాదు భార్య ప్రవర్తనకు న్యాయం చేసాడు
ఇంత న్యాయం చేసిన తనకు
న్యాయస్థానం న్యాయమివ్వనందుకు చింతలేదు
మరొక మైలురాయి కనిపించింది అంజయ్యకు
ఆఖరి మైలురాయి
రోడ్డు దుమ్ముతో బూజుపట్టిన పాలిపోయిన
ఎరుపు రంగు మైలురాయి
సంస్కారం ఉందనుకున్న మైలురాళ్ళు
తెల్లగా పాలిపోయి నిలుచున్నాయి
సంస్కారం లేదనుకున్న మైలురాళ్ళు
పాలిపోయిన ఎర్రరంగులో
మెరుగులేని విప్లవంతో
బూజుపట్టిన న్యాయంతో
మోజుపట్టని నిజాయితీతో
నిటాగ్గా నిలుచున్నాయి
తన గమ్యస్థానం చూసి
తనలో గర్వించాడు అంజయ్య!